క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

మల్కాపురం: శ్రీహరిపురం సబ్‌స్టేషన్ 33 కేవీ ఫీడర్ వార్షిక మరమ్మతుల కారణంగా సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం నెలకుంటుందని జోన్-2 ఈపీడీసీఎల్ ఈఈ బీకే నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ములగాడ విలేజ్, ఎదురవానిపాలెం విలేజ్ చుట్టు పక్కల ప్రాంతాలకు శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

పాత గోపాలపట్నంలో అన్నసమారాధన



భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం: జీవీఎంసీ 91వ వార్డు పాతగోపాలపట్నంలో వేణుగోపాలస్వామి ఆలయం వద్ద రథయాత్ర మహోత్సవాల్లో భాగంగా గురువారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ప్రారంభించారు. భక్తులకు అన్న ప్రసాదాలు వితరణ చేశారు. కార్యక్రమంలో నారిపిన్ని సత్తిరాజు, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా బక్రీద్



మత పెద్దల సందేశం వింటున్న ముస్లింలు

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు గురువారం ఘనంగా నిర్వహించారు. కోరమాండల్ సమీపంలోని ఈద్గా వద్దకు సుమారు 8 వేల మంది ముస్లిం సోదరులు చేరుకుని కుర్బానీ ఇచ్చుకున్నారు. అనంతరం నమాజ్ చేశారు.ఒకరికొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. ఈద్గా పెద్దలు బక్రీద్ విశిష్టతను వివరించారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

గోపాలపట్నం: జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం గోపాలపట్నం ఎస్ఆర్ ఆస్పత్రిలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు హాస్పిటల్ చైర్మన్ ఇ.సత్యానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో ఉచితంగా బీపీ, సుగర్, ఎక్స్‌రే పరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. వివరాల కోసం 63010 79746, 81427 61111నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

సిరులతల్లికి ఘనంగా సహస్ర తులసీదళార్చన



తులసీదళార్చనలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి గురువారం సహస్ర తులసీపూజ ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు సత్యరూపవాణి, ఎం.ధనలత, సతీష్, ఎన్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ఏఈవో తిరుమలేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. రూ.500 రుసుం చెల్లిస్తే ఇద్దరు భక్తులను పూజకు అనుమతించనున్నారు. వివరాలకు 0891 2566514, 2711725 నంబర్లలో సంప్రదించాలి.

స్థానిక నిరుద్యోగులకు ఉపాధి కల్పించండి



ఎల్ అండ్ టీ ప్రతినిధులకు వినతిపత్రం అందజేస్తున్న ఆదారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: హెచ్‌పీసీఎల్ విస్తరణ పనుల్లో స్థానిక నిరుద్యోగులకు అధిక అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆదారి ఆనంద్‌కుమార్ కోరారు. ఈమేరకు సంస్థలో విస్తరణ పనులు చేపడుతున్న ఎల్ అండ్ టీ ప్రతినిధులకు ఆయన వినతిపత్రం అందజేశారు. ఆదారి క్యాంప్ కార్యాలయంలో గురువారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతంలో అనేక మంది యువత సాంకేతిక, ఉన్నత చదువుల పరంగా అనుభవం కలిగి ఉన్నారన్నారు. విస్తరణ పనుల్లో వారి వారి అర్హతను బట్టి ఉపాధి కల్పించి, స్థానిక నిరుద్యోగులకు న్యాయం జరిగేలా సహకరించాలన్నారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ నాయకుడు పుర్రె సురేష్‌యాదవ్, కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, బల్లా లక్ష్మణరావు, నాయకులు దాడి సత్యనారాయణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయాల్లో ఏకాదశి పూజలు



ప్రత్యేక అలంకరణలో సంపత్ వేంకటేశ్వర స్వామి



కలియుగ వెంకన్న సన్నిధిలో అర్చకులు, భక్తులు

కంచరపాలెం: ఆషాఢ మాస శుద్ధ తొలి ఏకాదశి సందర్భంగా గురువారం గొల్లకంచరపాలెంలోని కోదండ సీతారామ, ధనలక్ష్మీదేవి, సంపత్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు శ్యామాచార్యులు ఆధ్వర్యంలో వెంకన్నకు సుప్రభాత సేవ, పంచామృతాభిషేకాలు, పద్మావతి, అలమేలు మంగమ్మలకు విశేష పూజలు జరిపారు. శ్రీరామా సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ నేతృత్వంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. సాయంత్రం నక్షత్ర హారతి, భక్తి సంకీర్తన, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

- తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, అర్చనలు, విశేష పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పోటెత్తిన భక్తులు

గోపాలపట్నం: స్థానిక ఆలయాలకు తొలి ఏకాదశి శోభ వచ్చింది. ప్రజలు ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. కొత్తపాలెం ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో తొలి ఏకాదశి పూజలు విశేషంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై అభి షేకాలు, అర్చనలు చేశారు. ఆలయ ప్రాంగణంలో సామూహిక పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందించారు.



ఆలయంలో సామూహిక పూజల్లో పాల్గొన్న భక్తులు



గోపాలపట్నం ఆలయంలో వేంకటేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు

జేసీఎస్ మండల ఇన్‌చార్జుల నియామకం



భోగవిల్లి నాగభూషణం



గేదెల కృష్ణం నాయుడు



పల్లా ఎర్నికుమార్



పిల్లా కన్నబాబు

గోపాలపట్నం: జేసీఎస్ మండల ఇన్‌చార్జులను నియమిస్తూ వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం నుంచి గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియామకాలు జరిగాయి. పార్టీ పశ్చిమ నియోజకవర్గంలో నలుగురిని ఎంపిక చేశారు.

ఇన్‌చార్జుల నేపథ్యం..

- భోగవిల్లి నాగభూషణం పారిశ్రామిక ప్రాంత కార్మిక నాయకుడిగా ఉన్నారు. పార్టీ కోసం కష్టపడి పని చేస్తున్నారు.
- పిల్లా కన్నబాబు కార్పొరేటర్‌గా పని చేశారు. ఇటీవల జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం కృషి చేశారు.
- గేదెల మురళీకృష్ణంనాయుడు(మురళీకృష్ణ) అడివివరం కో ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు.
- పల్లా ఎర్నికుమార్ వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పని చేస్తున్నారు. వార్డు బీసీ సెల్ అధ్యక్షుడిగా పని చేశారు.

నియోజకవర్గం పరిధిలో వార్డుల వారీగా..

ఇన్‌చార్జి	జీవీఎంసీ వార్డులు
భోగవిల్లి నాగభూషణం	40, 61, 62, 63
పిల్లా కన్నబాబు	58, 59, 60
పల్లా ఎర్నికుమార్	52, 56, 57
గేదెల మురళీకృష్ణ	89, 90, 91, 92

పార్టీ విజయంలో కీలకపాత్ర పోషిద్దాం



యువజన విభాగ నాయకులతో సమావేశం నిర్వహిస్తున్న ఆళ్ల శివగణేష్

తాటిచెట్లపాలెం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి యువజన విభాగం కీలక పాత్ర పోషించాలని పార్టీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్ పిలుపునిచ్చారు. రైల్వే న్యూకాలనీలోని జిల్లా యువజన విభాగం కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి నాయకులతో సమావేశం నిర్వహించారు. జిల్లా, వార్డు, మండల స్థాయి కమిటీల నియామకాలను ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలతో సమన్వయం చేసుకుంటూ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో జీలకర్ర నాగేంద్ర, బంగి హరికిరణ్ రెడ్డి, కొసిరెడ్డి గణేష్, మువ్వల సంతోష్, ఇల్లపు వెంకటరరావు, తాడి రవితేజ తదితరులు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో పనిచేయండి

- డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: రోగులకు చిత్తశుద్ధితో సేవలందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి. జగదీశ్వరరావు సూచించారు. పెందుర్తి మండల పరిధిలోని సరిపల్లి విలేజ్ హెల్త్ క్లినిక్, కుటుంబ డాక్టర్ విధానాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పీహెచ్‌సీ వైద్యులు,ఇతర ఆరోగ్య సిబ్బందితో సమీక్షించారు. ఏఎన్ఎం,ఆశ కార్యకర్తలు తమ పరిధిలోని హైరిస్క్ గర్భిణులను గుర్తించి వారిని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపించాలని సూచించారు. వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. గర్భిణులు,వ్యాధి నిరోధక టీకాలకు వచ్చే వారి వివరాలు యాప్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. కుటుంబ డాక్టర్ విధానంలో భాగంగా సరిపల్లి హెల్త్ క్లినిక్‌ను సందర్శించి గ్రామ ప్రజలతో మాట్లాడారు. వైద్య సేవలపై ఆరా తీశారు.

చందన అలంకరణలో శ్రీనివాసుడు



అల్లిపురం: తొలి ఏకాదశి పర్వదినాన బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరాలయంలో స్వామి చందన అలంకరణలో నేత్రపర్వంగా దర్శనమిచ్చారు. స్వామిని దర్శించుకునేందుకు వేకువ జాము నుంచే భక్తులు ఆలయం వద్ద బారులు తీరారు. ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు స్వామిని చందనంతో విశేషంగా అలంకరించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. ఆలయ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసి భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు.

పెద్దింటమ్మా.. చల్లగ చూడమ్మా



పూజలందుకున్న పెద్దింటమ్మ

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురంలో కొలువుదీరిన పెద్దింటమ్మ వారి పండగను గ్రామస్తులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆషాఢ మాసం తొలి ఏకాదశి సందర్భంగా నిర్వహించిన పూజల్లో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. భక్తులు అసౌకర్యానికి గురికాకుండా నిర్వాహకులు తగు ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అమ్మవారి ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను అంగరంగ వైభవంగా పుర వీధుల్లో ఊరేగించారు. పలువురు మహిళలు పూజారి పాదాలకు పసుపు రాసి,మంచినీటితో పాద పూజలు చేశారు. కార్యక్రమాల్లో మల్కాపురం గ్రామ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు,సభ్యులు పాల్గొన్నారు.

పాపా హోం విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



పుస్తకాలతో పాపా హోం విద్యార్థులు

అల్లిపురం: పోలీస్ బ్యారెక్స్‌లోని పాపా హోంలో ఆశ్రయం పొందుతున్న చిన్నారులకు వైఎస్సార్‌సీపీ నాయకుడు సీతంరాజు సుధాకర్ సహకారంతో పుస్తకాలు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ 31వ వార్డు అధ్యక్షుడు బత్తిన నాగరాజు, ఇన్‌చార్జి బత్తిన నవీన్‌కుమార్‌ల ఆధ్వర్యంలో గురువారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు పుస్తకాలతోపాటు అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో వార్డు నాయకులు, కార్యకర్తలు శంకరరావు, త్రిమూర్తులు, రాజేష్, జితేంద్ర, లక్ష్మణ్ పాల్గొన్నారు.

రోగికి మెడికల్ షూ అందజేత

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం బాబుకాలనీకి చెందిన పూతి ఎర్రయ్య మధుమేహంతో బాధపడడంతో రెండు కాళ్లు దెబ్బతిని నడవలేని స్థితికి చేరుకున్నాడు. ఈ విషయాన్ని వలంటీర్ కుమార్ ద్వారా తెలుసుకున్న కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ స్పందించారు. ఈ మేరకు ఆమె సూచనతో గురువారం వైఎస్సార్‌సీపీ వార్డు సీనియర్ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్ రోగి ఎర్రయ్య కాళ్లకు లెదర్ (మెడికల్) షూ తొడిగారు. మందుల ఖర్చుకు రూ. 3 వేలు అందజేశారు. నాయకులు వేలంగిని రావు, శ్యామ్‌సుందర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథుడి తిరుగు రథయాత్ర



తిరుగు యాత్రలో రథాన్ని లాగుతున్న భక్తులు

అగనంపూడి: జగన్నాథస్వామి తిరుగు రథయాత్ర గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. సాయంత్రం ఐదు గంటలకు ఇంద్రద్యుమ్న హాలు నుంచి బలభద్ర, సుభద్ర సహిత జగన్నాథస్వామిని రథంపై అధిష్ఠింపజేసి, రథాన్ని జాతీయ రహదారిమీదుగా ఆలయం వరకు భక్తులు లాక్కొని వెళ్లారు. వందలాదిగా పాల్గొన్న భక్తులు రథం లాగేందుకు పోటీ పడ్డారు. కోలాటంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఆలయ కమిటీ చైర్మన్ జెర్రిపోతుల సోమునాయడు, కమిటీ ప్రతినిధులు గెద్దాడ సత్యవతి, దేవరాజు, శ్రీనుబాబు, సన్యాసమ్మ, ఆలయ పూర్వీకులు గురు త్రినాథ్, మోహన్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

'అగనంపూడి టోల్‌గేటు తరలించాలి'

అగనంపూడి: అనకాపల్లి-సబ్బవరం మధ్య టోల్‌గేటు ఏర్పాటు చేసిన తరువాత కూడా అగనంపూడి టోల్‌గేటు కొనసాగించడం అన్యాయమని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ జి.పూర్ణానందశర్మ అన్నారు. వెంటనే టోల్‌గేట్‌ను ఇక్కడి నుంచి తరలించాలని డిమాండ్ చేశారు. అగనంపూడిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల క్రితం హైకోర్టు ఆదేశాల మేరకు టోల్ ఫీజు ఉపసంహరించుకున్నారని, తరువాత హైవే అధికారులు, కాంట్రాక్టర్ సుప్రీంకోర్టును ఆశ్రయించే సమయంలో అనకాపల్లి వద్ద టోల్‌గేటు ఏర్పాటు చేసిన తరువాత అగనంపూడి టోల్‌ప్లాజాను మూసివేస్తామని న్యాయస్థానానికి రాతపూర్వకంగా హామీ ఇచ్చారని పేర్కొన్నారు. రెండున్నర దశాబ్దాల క్రితం రహదారి విస్తరించే సమయంలో రుణంగా తీసుకున్న మొత్తం తిరిగి రాబట్టిన తరువాత కూడా అడ్డగోలుగా దోపిడీ చేయడం తగదన్నారు.

'అమ్మ ఒడి'తో తల్లులకు జగన్ అండ



అమ్మ ఒడి పథకం ద్వారా వచ్చిన చెక్కును తల్లికి అందిస్తున్న కార్పొరేటర్ కొణతాల సుధ

మల్కాపురం: ప్రతీ తల్లి తన బిడ్డలను స్కూల్‌కు పంపించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమ్మఒడి,జగనన్న విద్యా కానుక,జగనన్న విద్య దీవెన వంటి పథకాలు పెట్టి వారికి అండగా నిలుస్తున్నారని 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ అన్నారు. మల్కాపురం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో పలువురు విద్యార్థుల తల్లులకు అమ్మ ఒడి పథకం ద్వారా వచ్చిన నగదును గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత పాలకులు ఏనాడైనా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల యోగ క్షేమాల గురించి ఆలోచించారా అన్ని ప్రశ్నించారు. నాడు నేడు ద్వారా పాఠశాలలు అభివృద్ధి,నాణ్యతతో కూడిన మిడ్ డే మీల్స్,రాగి జావ పంపిణీతో విద్యార్థులకు పౌష్టికాహారం అందిస్తున్నారన్నారు. ఉచితంగా పాఠ్య పుస్తకాలు,నోట్ బుక్‌లు,షూలు,యూనిఫాం ,స్కూలు బ్యాగులు అందిస్తూ వారి ఉన్నత చదువుకు జగన్ దోహద పడుతున్నారని వివరించారు. కార్యక్రమంలో నాయకులు దాడి సత్యనారాయణ,కొల్లి నూకరెడ్డి,చట్టి నూకరాజు,పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హరికృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పిలక దేవేశ్వరికి నివాళి



పిలక రామ్మోహన్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఆదారి ఆనంద్‌కుమార్, పార్టీ నాయకులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం రెడ్డి వీధికి చెందిన పిలక దేవేశ్వరి అరుణాచలం పుణ్యక్షేత్రంలో స్వామి దర్శనానికి వెళ్లి అక్కడ మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆదారి ఆనంద్ కుమార్ గురువారం దేవేశ్వరి ఇంటికి వెళ్లి మృత దేహం వద్ద నివాళులర్పించారు. ఆమె భర్త వైఎస్సార్ సీపీ 63వ వార్డు ఇన్‌చార్జి పిలక రామ్మోహన్‌రెడ్డిని (పిలక రాము) పరామర్శించి ఓదార్చారు. ధైర్యంగా ఉండాలని, పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తమిళనాడు అరుణాచల యాత్రకు వెళ్లిన దేవేశ్వరి మరణించడం చాలా బాధాకరమన్నారు. నివాళులర్పించిన వారిలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, పలు వార్డుల కార్పొరేటర్లు కొణతాల సుధ, బల్లా లక్ష్మణరావు, గుండపు నాగేశ్వరరావు, పి.వి.సురేష్, పార్టీ వార్డు అధ్యక్షులు చుక్క ప్రసాద్‌రెడ్డి, పుర్రె సురేష్ యాదవ్, గులిగిందల కృష్ణ తదితరులు ఉన్నారు.

ఎన్ఏడీ సీఈ ఎంప్లాయీస్ ఎన్నికల పోరు షురూ



సీఈ యూనియన్ ప్యానల్ సభ్యులు

గోపాలపట్నం: నేవల్ ఆర్మమెంట్ డిపోలో ఎన్నికల సందడి మొదలైంది. ఎన్ఏడీ సివిల్ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ సొసైటీ పాలక మండలి కాల పరిమితి పూర్తి కావడంతో ఎన్నికల నగారా మోగింది. దీంతో ఎన్ఏడీ సీఈ యూనియన్, ఎన్ఏడబ్ల్యూ అండ్ ఎస్ యూనియన్ తలపడుతున్నాయి. అందులో ఎన్ఏడీ సీఈ యూనియన్ తన ప్యానల్‌ను ముందుగా ప్రకటించింది. కె. సూరి రెడ్డి, జి. ముత్యరాజు, టి. సంతోష్ కుమార్, వీటీఆర్ శ్రీను, కె. నారాయణరావు, డి. శివ, వి. సంతోష్‌కుమార్, కె. సూర్యనారాయణ పోటీలో ఉన్నారని సీఈ యూనియన్ నాయకులు చెబుతున్నారు. తమ సభ్యులను ఎన్నుకుంటే సొసైటీ సభ్యులకు 9 శాతం వడ్డీతో రుణాలు మంజూరు చేస్తామని హామీ ఇస్తున్నారు. సభ్యుల పిల్లలకు ఇన్సూరెన్స్, సొసైటీ సభ్యులకు ఇంటి స్థలం అందిస్తామంటూ హామీలతో ముందుకెళ్తున్నారు. ఈ ఎన్నికల్లో తమ ప్యానల్‌ను గెలిపించాలని కోరుతున్నారు.

'ఉక్కు' సంకల్పానికి కేంద్రం తలవంచాల్సిందే..



868వ రోజు ఉక్కు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: ఉక్కు సంకల్పంతో నిర్విరామంగా కొనసాగుతున్న స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ ఉద్యమానికి కేంద్ర ప్రభుత్వం తలవంచక తప్పదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 868వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారం అమ్మాలనే ఆలోచన వచ్చిన మోదీ ప్రభుత్వానికి ప్రజలు గట్టిగా బుద్ధి చెప్తారన్నారు. ఎందరో కార్మికుల బలిదానాలతో సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పడం దుర్మార్గమన్నారు. వెంటనే స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలోనే కొనసాగుతుందనే ప్రకటనను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలను ఉధృతం చేసేందుకు భవిష్యత్తు ప్రణాళికను సిద్ధం చేస్తున్నామన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన నిరంకుశత్వ నిర్ణయాన్ని వీడి ప్రైవేటీకరణను ఆపాలని కోరారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

సింహగిరిపై మొక్కల పంపిణీ



మొక్కలను భక్తులకు అందజేస్తున్న ట్రస్ట్‌బోర్డు సభ్యులు

సింహాచలం: తొలి ఏకాదశి పురస్కరించుకుని గురువారం సింహగిరిపై స్వధర్మ వాహిని ఆధ్వర్యంలో భక్తులకు మొక్కలు పంపిణీ చేశారు. గాజువాకకు చెందిన భక్తులు కాశీ కృష్ణ, కంచి శేషగిరిరావు కడియం నుంచి తీసుకొచ్చిన వెయ్యి మొక్కలను అందజేశారు. ఆ మొక్కలకు ఆలయ ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు, అర్చకులు కల్యాణ మండపంలో పూజలు చేశారు. అనంతరం రాజగోపురం వద్ద ఉన్న కళావేదిక వద్ద దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు, అధికారులు భక్తులకు మొక్కలు పంపిణీ చేశారు. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు సంపంగి శ్రీనివాసరావు, వారణాసి దినేష్‌రాజ్, సువ్వాడ శ్రీదేవి, ముదుండి రాజేశ్వరి, ఆలయ ఏఈవో భ్రమరాంబ, సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళావేదికపై అన్నమయ్య సేవా ట్రస్ట్ నిర్వాహకురాలు సునీత ఆధ్వర్యంలో సామూహిక విష్ణుసహస్రనామ పారాయణ చేపట్టారు.

ట్రిపుల్ ఆర్ సెంటర్లతో పర్యావరణానికి మేలు

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



ట్రిపుల్ ఆర్ సెంటర్‌లో పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్ వర్మ తదితరులు

అల్లిపురం: అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు రెడ్యూస్, రీయూజ్, రీ సైకిల్ సెంటర్లు (ట్రిపుల్ ఆర్) ఎంతో ఉపయోగపడతాయని జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ అన్నారు. గురువారం ఆయన ఎండాడ, తగరపువలస, గాజువాక, పెందుర్తి ప్రాంతాల్లో గల ట్రిపుల్ ఆర్ సెంటర్లను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రిపుల్ ఆర్ సెంటర్ల ఉపయోగాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు, వ్యర్థాల నిర్వహణకు, స్థిరమైన అభివృద్ధికి ఈ కేంద్రాలు బాటలు వేస్తాయని పేర్కొన్నారు. వ్యర్థ పదార్థాల్లో అనేక రకాల గాజు, కాగితం, మెటల్, ప్లాస్టిక్, టైర్లు, దుస్తులు, పుస్తకాలు, బ్యాటరీలు, ఎలక్ట్రానిక్స్ ఉపకరణాలను ట్రిపుల్ ఆర్ సెంటర్ల ద్వారా సేకరించి రీసైక్లింగ్ చేసి ఆట వస్తువులతోపాటు ఇతర వస్తువులు తయారు చేయవచ్చన్నారు. అనంతరం తగరపువలస, సబ్బవానిపాలెంలోని బుక్ కేఫిని సందర్శించి పౌరులకు మంచి విజ్ఞానాన్ని అందించే పుస్తకాలు అందుబాటులో ఉంచాలని సూచించారు.